# నీలవేణి

వేగంగా ప్లాట్‌ఫారం మీదకి వచ్చి కూడా పరుగెదుతున్న రైల్లోంచి ఆత్రుతగా కలియచూస్తోంది నీలవేణి. చూపులు చెదిరిపోతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి గానీ ఆ జన సమూహంలోంచి ఎవరెవరో గుర్తించటం చాలా కష్టమైన పనని అర్థమవుతోంది. ఎలాగూ రైలు ఆగకా తప్పదు తను దిగకా తప్పదు. తనకోసం వచ్చేవారిని తను కలుసుకోకా తప్పదు అయినా ఏదో ఆత్రం, ఏదో పోటీ - పాతికేళ్ళు గడిచిపోయిన కాలంతో పరుగెట్టి పరుగెట్టి యిప్పుదు, ఆగేముందు ఏదో తెలియని ఆత్రుత -

రైలు ఒక్క జర్కిచ్చి ఆగింది. మనుషులు తలలు మాత్రం వేగంగా కదులుతున్నాయి. చెవులు చిల్లులు పడే కేకలు, అరుపులు, శబ్దాలు - ఎవరెవరో - ఏమిటో అంతా గందరగోళం.

నీలవేణి తన చిన్న సూట్‌కేస్ చేతిలోకి తీసుకుని దిగేవారి వెంట వరుసలో నిలబడి నెమ్మదిగా ప్లాట్‌ఫారమ్ మీదకి చేరి ఓ పక్కగా నిలబడింది.

అటూ ఇటూ మెడతిప్పుతూ సూదుల్లాంటి చూపులతో ఒక్కొక్క ముఖాన్ని పరీక్షించడానికి ప్రయత్నిస్తోందామె. తన కోసం వచ్చిన వాళ్ళని తను గుర్తుపట్టగలదా! వాళ్ళే తనని గుర్తు పట్టేస్తారో చూడాలి. నిర్మల, నరేష్ రావచ్చు లేదా మీరా రావచ్చు కాకపోతే పద్మా రావచ్చు. వాళ్ళందరి ముఖాలు తనకి స్పష్టంగా కళ్ళల్లో మెదులుతూ ఉన్నాయి. తను వాళ్ళెవరినైనా గుర్తుపట్టేయగలదు. తన ముఖం మాత్రం వాళ్ళ కళ్ళల్లో మెదులుతూ ఉండదా? తనని చూడంగానే ఎగిరి గంతేసి కౌగలించేసుకోరా?

ఏదో స్మృతిలోంచి ఒక మెరుపు మెరిసి, చకచకా నడుచుకుంటూ జనంలోకి వెళ్ళిపోయినట్లనిపించింది - ఆ వెళ్ళిన ఆకారం వైపు నీల చూపులు కొంత ప్రయాణించి చెదిరిపోయాయి. మళ్ళీ శ్రద్ధగా అటూ యిటూ మరింత తీక్షణంగా చూస్తోంది. మళ్ళీ అలాంటి బొమ్మే - ఎప్పటిదో పాతపెట్టి సర్దుతుంటే చిన్ననాటి ఫోటో దొరికినట్టు-

నీలవేణి ఒక్కసారిగా మీరా అంటూ అరిచింది. లావుగా గుండ్రటి ముఖంతో ఆమె వెనక్కి తిరిగింది. ఆ కళ్ళు అరక్షణం ఆశ్చర్యంతో, అంతలోనే ఆనందంతో మరొక్క క్షణానికి ప్రేమానురాగాలు కన్నీళ్ళుగా - 'నీలా' అంటూ కౌగిలించేసుకుంది. మీరా వెంటనే తిప్పుకోలేకపోయింది. స్నేహితురాల్ని బల్లిలా కరుచుకుపోయింది. అందరూ వీరిని నొక్కక్షణం చూసి తప్పుకుపోతున్నారు. లావుగా పోలిక లేకుండా బొజ్జ ఊపుకుంటూ 'ఎవరూ నీలేనా' అంటూ వచ్చిన మనిషిని నరేష్‌గా గుర్తించి ఆనందపడిపోయింది.

"ఏమిటీ నీలా నీలా నీలా నువ్వా? ఏమిటా తెల్ల జుట్టు ఆ ముఖం అయ్యో ఏమిటీ ఏమైపోయింది నీ నల్లగా, తుమ్మెద రెక్కల్లాంటి పొడవైన జుట్టు, నీ జడ ఒక నల్లత్రాచులా వుందని ఎప్పుడూ అంటూండేవాడిని - ఎన్నిసార్లు, నీ నల్లని జడతో నన్ను ముఖం మీద కొట్టావు? అయినా ఏమిటా ముసలి రూపం అసలా నెరిసిన జుట్టేమిటి?" నరేష్ మాటలు ఆగటం లేదు.

అతనిలోంచి పొంగుకొస్తున్న అంత ప్రేమలోంచీ ఏదో అపశ్రుతి నీల హృదయానికి తాకుతోంది - మీరా అడ్డుపడకపోతే నరేష్ మాటలు ఆగేవి కావు.

"ఏయ్ నర్రీ ఆగు ఏమిటదీ - మనం చూసుకుని పాతికేళ్ళయింది. రూపురేకలన్నీ మారిపోక అప్పటిలాగే ఉండిపోతామా"

"అది కాదు మీరా! మరీ అంతలా - అయినా జుత్తు - అంత తెల్లగా ఎలా నెరిసింది.

"ఏం? నలభైలు దాటాక జుట్టు నెరవడం ఆశ్చర్యమేం కాదు"-

ఏమో, నేనూహించలేకపోతున్నాను. నిమ్మీ లేదా, నువ్వు లేవా మీరంతా

"అబ్బ నువ్వు కాస్త నోరు మూస్తావా? నిర్మల ఏదీ ఇంకా పెట్టి పెట్టి వెదుకుతోందేమో" మీరా మాటలు పూర్తికాక ముందే నిర్మల ప్రత్యక్షమైంది. అందరూ మారిపోయారు. కానీ నీలవేణిలోని మార్పును నరేష్ ఎందుకు జీర్ణించుకోలేక పోతున్నాడో!...

"ఏమిటే నీలా! అంత ముసలవతారంలా తయారయ్యావు ఏమిటా నెరిసిన జుట్టూ నువ్వూనూ" అంటూ నిర్మల ఎంత ప్రేమ ఒలకబోసినా నీలవేణి మనసులో లోపల కుంచించుకుపోవడం మొదలైంది.

మళ్ళీ నువ్వు మొదలా? మనం ఇక్కడ్నించి బయటపడి, దానికి కాస్త విశ్రాంతి యిస్తే మనిషవుతుంది. అంటూ మీరా తొందర జేసింది. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో నీల సూట్‌కేస్ అందుకోబోయింది.

"నువ్వుండు, నీ సూట్‌కేస్ నువ్వే మోసుకోనక్కరలేదు. మేము ముసలివాళ్ళకు కూడా సాయం చేస్తాం" నరేష్ తన జోక్‌కి తనే నవ్వుతుంటే గాడిద మీద కదిలే బట్టల మూటలా ఉంది అతని పొట్ట -

నీలవేణికి నవ్వొచ్చింది -

"హమ్మయ్య నువ్వు నవ్వితే నీ బుగ్గ సొట్టపడింది కనుక నువ్వే నీలవని నమ్ముతున్నా - లేకపోతే"

"నడు నడు తర్వాత కబుర్లు" మీరా అందర్నీ తొందరచేసింది.

ముగ్గురూ వేసే ప్రశ్నలకు ఊ, ఆ అని సమాధానాలు చెప్తూ వాళ్ళని పరిశీలనగా చూసింది. నిజమే, నిర్మల జుట్టు చక్కగా నల్లగా నిగనిగలాడుతూ ఉంది. మీరా జుట్టు నొక్కులు నొక్కులుగా నల్లగా తీర్చిదిద్దినట్లుగా ఉంది. నిజానికి వారిద్దరి కంటే తను కాస్తంత వయస్సులో చిన్నదే మరి-

ఇదేమంత పెద్ద విషయంగా ఎప్పుడూ ఆలోచించకపోయినా ఇప్పుడు మాత్రం మనసులో ఏదో ములుకు ఉండుండి గరగరమంటున్నట్లుగా ఉంది. మరి వేరే ధ్యాసలో ఉంటే బాగుండదని తన ఆలోచనల్ని పక్కకి పెట్టి పాతికేళ్ళ నాటి ప్రాణ స్నేహితులు పలకరింతలకు సమాధానాలిస్తూ చకచకా అడుగులేసింది నీలవేణి.

"ఇన్నాళ్ళకి నువ్వొస్తుంటే నువ్వు ముందుగా మా యిళ్ళల్లో ఎక్కడైనా ఉండాలి గానీ, హోటల్ రూంలో నిన్ను దింపటమేమిటని..." మీరా ఆగింది.

"భలే దానివే - నాకు మీ దగ్గర ఉండడం కంటే మరింకేం కావాలి"

"నాకు తెలీదా" అంది మీరా.

"అస్తమానూ మీ ఇద్దరే మాట్లాడేసుకుంటున్నారు" నరేష్ ఫిర్యాదుకి అందరూ నవ్వుకున్నారు.

"నిజానికి నేనిక్కడికి, ఈ అవకాశం ఉపయోగించుకుని వచ్చానంటే అది మిమ్మల్నందర్నీ చూడాలనే.

నిర్మల ఆప్యాయంగా నీల చేతిలో చెయ్యి కలిపి నడుస్తోంది. ఆ చేతుల కలయికలో స్నేహం వెచ్చగా గుండెల్ని తాకుతోంది.

"ఇల్లు గోల లేకుండా మనం కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకునేందుకు వసంత్ విహార్"లో రూం పెట్టాను. మీరా ప్రత్యేకంగా చెప్పడంతో నీలకి ఆనందం రెండింతలైంది. తనలాగే వాళ్ళు కూడా తనని చూడాలనీ, కబుర్లు చెప్పుకోవాలనీ తహతహలాడుతున్నారన్నమాట - అదే ఆనందం ఆమె మనసులో కదులుతున్నా, ఏదో అసంతృప్తి, ఏదో కోల్పోయిన భావన లోలోపల పీడిస్తోంది.

స్నానం చేసి, టిఫిన్ చేసి మంచం మీద ఒరిగింది మీరాకి అర్జంట్ పనుందని వెళ్ళింది. నరేష్ కాలేజీలో ఒక క్లాసు మాత్రం ఉంది చెప్పి వచ్చేస్తాననీ వెళ్ళిపోయాడు. నిర్మల అత్తగార్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళాలని వెళ్ళింది.

నీల మంచం మీంచి లేచి, లోపల గడియపెట్టుకుని, అద్దం ముందు నిలబడి తనని తను నిశితంగా చూసుకోవడం మొదలుపెట్టింది. నిజమే తన జుట్టంతా నల్లని ఆకాశంలో తెల్లమబ్బు తునకలు కదులుతున్నట్టుగా - తెల్లజుట్టూ, నల్లజుట్టూ కలిసి వింతగా ఉంది. ఇన్నాళ్ళూ వింతగా తోచని ఈ విషయం ఇప్పుడు ఎలాగో అనిపిస్తోంది. వెంటనే తన రూపం మార్చేసుకోవాలనిపిస్తోంది. తన కళ్ళల్లో వెలుగు తగ్గలేదు. తన చెంపలలో నిగారింపు తగ్గలేదు. తన పెదవులు ఎండిపోయి, పాలిపోయి లేవు-, కానీ తనకి జుట్టు నెరవడం వల్ల ఈ గుణాలన్నీ మరుగున పడిపోయాయి. తనకు లేని పెద్దరికం అంటగట్టి కృంగదీస్తోంది. మనిషిలోని ఆకర్షణలకి నల్లని జుట్టు ఒక్కటే ప్రమాణమా? ఏమో! అది మనిషి జీవితంలో చాలా సహజమైన మార్పు. ఒక్కొక్కరికి ముప్ఫైలు దాటుతుండగానే అక్కడక్కడ వెండి వెంట్రుకలు మెరుస్తాయి. కొందరికీ అరవై దగ్గరవుతున్నా, నల్లగా, ఒత్తుగా జుట్టు ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.

నీలవేణి తన ఆలోచనలకి తనే ఉలిక్కిపడింది. ఏమిటి తను మరీ ఒకటే విషయం. చుట్టూ గిరిటీలు కొడుతోంది. నిజానికి ఈ ఆధునిక యుగంలో ఇదొక ఆలోచించవలసిన విషయమూ కాదు తెలుపుని నలుపు చేయడం పెద్ద అసాధ్యమూ కాదు.

తలుపు మీద సున్నితంగా టక్ టక్ టక్ -, నీల వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా మీరా, చరచరా లోపలికొచ్చేసింది. ఆమె చేతిలో ఉన్న ప్యాకెట్ టేబుల్ మీద పెట్టింది-

జగ్గులోంచి మంచినీళ్ళు గ్లాసులోకి వొంపుకుని తాగి, కొంగుతో తుడుచుకుంది.

బాగా ఎండగా ఉంది కదా! అలసిపోయినట్టున్నావు అంది నీల.

"ఆ... దాందేముంది లే గానీ - నువ్వేంటి యిలాంటి అవతారమెత్తావు"

"ఏమిటీ -ఏమైంది"

ఇంత పెద్ద రచయిత్రివి. ఇంతపేరు తెచ్చుకున్నదానివి. ఎన్నో జీవన సమస్యల్ని నీ రచనల్లో చర్చించిన దానివి"-

"అబ్బ! అసలు సంగతేమిటో చెప్పు" అంది నీల.

అదే ... నీ జుట్టు-

"ఏమైందిప్పుడు?"

ఇంకా ఏం కావాలి? నీ నెరిసిన జుట్టూ నువ్వూ - అమ్మమ్మలా ఉన్నావు.

నీలకి సర్రున కోపమొచ్చింది. జుట్టు నెరవడం, అమ్మమ్మవడం ఏదో చాలా చేయరాని నేరాలుగా మీరా అంటుంటే నీలకి ఎక్కడ లేని కోపమూ వచ్చింది - ఆమె చెప్పేంతలో.

"మరీ అంత అశ్రద్ధయితే కష్టం" అంటూ ముగించింది.

"ఏమిటీ - మీరంతా చాలా వింతగా మాట్లాడుతున్నారు. ఏదో భయంకరమైన విషయాన్ని చూస్తున్నట్టు - ఏం జుట్టు తెల్లబడడం అంత అసహజమైన విషయమా" నీల గొంతు ఖంగుమని మోగింది.

అసహజమేం కాదు గానీ నువ్వు దాన్నలాగే ఉంచుకుని ఇలా నలుగురిలోకి రావడం కొంచెం బాగా లేదు".

"ఏం? ఎందుకని? వయస్సు వచ్చాక జుట్టు నెరవడం సహజం కాదా"-

బయటికి తిరిగే వాళ్ళం. మీటింగులనీ, ఉపన్యాసాలనీ, పబ్లిక్కులోకి వెళ్ళే వాళ్ళం కాస్త శుభ్రంగా ఉండాలి. అంటే - ఇలాంటి విషయాల్లో.

"ఏం చెయ్యాలి"నీల గట్టిగానే అరిచింది.

"నువ్వేం కోపం తెచ్చుకోవద్దు. నీ విషయంనే చూసుకుంటా"

"అంటే"

కాస్త నీ జుట్టుకి డై చేస్తా"

"ఎందుకూ" ఒక్కసారి బెదిరి వెనక్కి తగ్గింది నీల.

నీకు తెలీదు. నలుగురిలోకి వచ్చినప్పుడు కాస్త గ్లామరస్‌గా ఉండాలి. మరీ వయసు మీద పడిన దానిలా ఉంటే బాగుండదు"

"జుట్టుకు రంగు వేసినంత మాత్రాన వయస్సును దాచగలమా"

ఆ... కనీసం పదేళ్ళు తెలీదు"

"అసలెందుకు దాచాలి"

అబ్బబ్బ- నీకెంత చెప్పినా అర్థం కాదేవిటీ"

అవును. మీరు నన్నిక్కడికి మాట్లాడమని పిలిచింది. నా రచనలు చదివి, నా ఆలోచనా విధానం తెలుసుకుని, రచయిత్రిగా నాకున్న పేరు వలనా? లేకపోతే నాకు నల్లని పొడుగాటి జుట్టు ఉండేది కనుక అది ఈనాటికీ అలా ఉండి ఉంటుందనా-"

"నిన్ను నీ పేరు చూసే పిలిచాం కానీ నువ్వు వేదిక ఎక్కినప్పుడు నీట్‌గా, చక్కగా..."

ఎంతసేపు వాదించినా మీరా వాదన నీలకి అర్థం కావడం లేదు. అందరూ తన సౌందర్యం మీదా, తను అందంగా కనిపించటం మీదా ఎంతుకింత ఆందోళన పడుతున్నారో అర్థం కావడం లేదు.

చివరిగా మీరా తను తెచ్చిన ప్యాకెట్ విప్పి అందులోని హెయిర్‌డ్రై తీసి వేసుకోమని చెప్పినప్పుడు నీల నిర్ఘాంతపోయి చూస్తూండిపోయింది. ఆమె మనసును తిప్పుకునేందుకు కొంత సమయం పట్టింది.

"సారీ మీరా, నువ్వు పెట్టిన ఈ సభలో యిలా జుట్టు నెరిసిన రచయిత్రి మాట్లాడడం యిష్టం లేకపోతే, నిగనిగలాడే తుమ్మెద రెక్కల్లాంటి జుట్టున్న మరొకరి చేత మాట్లాడించుకో. అంతేగానీ-

ఈసారి మీరా ఒక్కసారి జంకిపోయింది ఆమె కూడా మాట తిప్పుకోడానికి పది నిముషాలు పట్టింది.

"ఇంత మూర్ఖురాలివయ్యావేంటి?"- నేను చెప్పేది శ్రద్ధగా విను"

"ఏమిటి నువ్వు చెప్పేది"-

నీలవేణి, మీరా ఎంతసేపు వాదించుకున్నా ఎవరి మార్గంలో వారుండిపోయారు గానీ ఒకరితో ఒకరు ఏకీభవించలేదు.

నలుగురిలో సభలనీ, ఉపన్యాసాలనీ సోషల్‌గా తిరిగేవారికి జుట్టు నెరిస్తే బాగుండదని, కాస్త డై చేసుకుని ఆకర్షణీయంగా ఉండాలనీ మీరా వాదిస్తూనే ఉంది.

నేను సినిమా నటిని కాదు కదా! నేను ఈ సౌందర్యంతో ఎదుటి వారిని ఆకర్షించాల్సిన అవసరం ఏమిటీ అని నీల ప్రశ్నిస్తూనే ఉంది -

ఆ వాదనకీ అంతం లేదు. ఈ ప్రశ్నకీ జవాబు లేదు. విసిగిపోయి, మీరా యింకా సంగతి వదిలేసింది - నీల మీరా చెప్పిన విషయాన్ని కొట్టిపారేసి, ఎంత ప్రశాంతంగా ఉందామన్నా, మనసంతా డల్‌గా చికాకు అయిపోయింది. తనలో ఉండే ఆలోచనలకీ, అభిప్రాయాలనీ ఈ నెరిసిన జుట్టు అడ్డు అనే భావం ఆమెకి గొప్ప వేదన కలిగించింది.

మీరా తను ఒకటే ప్రాణంగా ఉన్న స్నేహితులం. తనని బాధించటానికి ఆమె ఒక్క మాట కూడా అనదని బాగా తెలుసు. తన కోసమే, తన కీర్తి కోసమే, తన యందు అందరూ ఆకర్షితులు కావాలనే మీరా ఇంత వాదించిందని తెలుసు. కాని - కానీ ఆమె ఆలోచన ఎంత తప్పుగా తనకి తోస్తోంది? తనకేం వైరాగ్యం లేదు కానీ సహజత్వాన్నించి పారిపోయి ఎన్నాళ్ళు ఆర్టిఫిషియల్ బతుకు బతకగలం? అసలెందు కలా చెయ్యాలి?

నిజమే; శరీరంలోని సౌందర్యం అనే అంశాన్ని ఎంతగానో పోషించుకోవాలి. ఎవరు? స్త్రీలు. వారికి ఆలోచనకంటే మనసు కంటే, సౌందర్యం ముఖ్యం. మనిషి అందానికి అత్యంత ముఖ్యమైనది జుట్టు. అది ఎంతో అందాన్ని ఆకర్షణని ఇస్తుంది. మనిషిలో పొడ చూపే ముసలితనపు రూపానికి నెరసిన జుట్టు మొదటి మెట్టు. యవ్వనదశని కోల్పోతున్నామని, వయసు మీద కొస్తోందనీ ఒప్పుకోవాలంటే చాలా కష్టమైన విషయం. ఎవ్వరూ కూడా తమ వయస్సులో ఎంతో కొంత తగ్గించి మాత్రమే చెప్పుకోవటానికి ఇష్టపడతారు. అది జీవితం పట్ల వ్యామోహాన్ని, జీవించాలనే కాంక్షని తెలియజేస్తుంది. మన సంప్రదాయంలో మగవాడికి వయస్సు గురించిన ప్రశ్న లేదు. వాడెంత ముసలివాడైనా మగవాడు మగవాడే - ఆడదానికి వయసుని అడగవద్దనే దుర్మార్గపు ఆలోచన అక్కడిదే - అంటే ఆడదానికి 'జీతం' అనేది లేదనీ మగవాడికి వయసనేది అడ్డు రాదు. ఆమె ఎప్పుడూ అతనికి పనికి వచ్చేదిగా ఉండాలి. ఆమె వయసు కనిపించకుండా కాపాడుకోవాలి. ఆమె శరీర సౌష్టవాన్ని పదిలంగా కాపాడుకోవాలి. ఇది అనాదిగా వస్తున్న ఆలోచనా ధోరణి. దీన్నించి మగవాడే కాదు. ఆడవాళ్ళు కూడా తప్పించుకోలేరు. నీలవేణి ఆలోచనలతో తలనొప్పి వచ్చేసింది. ఒక తలనొప్పి బిళ్ళ మింగికళ్ళు మూసుకుంది. కానీ మనసుని, ఆలోచనల్ని మూయడం ఆమెకు సాధ్యపడలేదు.

ఆ సాయంత్రం ఎందరో మిత్రులు - ఏనాటి వాళ్ళో అందరూ నీలవేణిని కలుసుకునేందుకొచ్చారు.

చిత్రంగా వచ్చిన అందర్లో ఏ ఒకరో ఇద్దరో తప్పస్తే అందరూ నీలవేణి జుట్టు గురించి ఏదో ఒకటి అన్నారే గానీ ఊరుకోలేదు.

"ఏమిటీ నీలా అప్పుడే ముసలిదానవయిపోయావా" అని-

"అరె! ఏమిటా తెల్ల జుట్టు - మరీ ఇలా అయిపోయావేంటి?"

"నీలా - ఏమిటీ నువ్వేనా గుర్తు పట్టలేకపోతున్నా నల్లగా పట్టుదారాల ఉచ్చులా నీ నుదుటి మీదకి వాలిపోయే నీ జుట్టు ఏమైందీ"-

"నీలవేణీ ... ఇంక నువ్వు పేరు మార్చుకోవాలేమో"

"అయినా నీలకి మొదటి నుండి శ్రద్ధ తక్కువ"

"కొబ్బరి నూనెలో ఉసిరిపప్పులు - మందార పువ్వులు వేసి కాచి అది రాసుకుంటే జుట్టు త్వరగా నెరవదు"

ఇలా కొందరు నవ్వుతూ, కొందరు హాస్యంగా, మరికొందరు జాలిగా, ఇంకా కొందరు సలహా యిస్తున్నట్లు రకరకాల స్వరాల భంగిమలలో మాట్లాడారు.

అందర్నీ నవ్వుతూ స్వీకరించడానికి, నవ్వుతూ భరించటానికి ప్రయత్నించింది నీలవేణి. ఏమైనా హృదయమంతా పెద్ద దుఃఖ సముద్రంలా అయిపోయింది.

ఇన్నాళ్ళూ వీళ్ళంతా తన నల్లని జుట్టుని చూసి, దానికి తగినట్టు తన పేరు నీలవేణి కావడం వల్ల ప్రేమించారన్న మాట-,

మర్నాడు తను మాట్లాడవలసిన విషయాలు ఏమిటా అనే ఆలోచనలో పడిపోయింది నీలవేణి. ఎందుకో ఉత్సాహం చాలావరకు అడుగంటి పోయిన భావన ఆమెని బాధించడం మొదలుపెట్టింది.

ఆమె ఆలోచనలోకూడా మార్పువచ్చింది. తను మీరా చెప్పినట్లుగా వింటే ఈ బాధ ఉండదుగా! ఇలా అందరూ ఏదో కామెంట్స్ చేయడం, వాటిని తను ఎదుర్కోవడం, ఒక దుర్భరమైన అనుభవంగా ఆమెకనిపించింది.

నిర్మల, మీరా, పద్మాక్షి, శకుంతల, నరేష్, భాను అందరూ బిలబిలమంటూ వచ్చేసి నీలని చుట్టుముట్టారు. అందరికీ నీల సమస్య అంతో యింతో అర్థమైంది. కాని వాళ్ళు మిగిలిన వాళ్ళకి చెప్పి మరింత ప్రచారం చేశారు. ఇంక అందరూ నీలను జాలిగా చూడడం, సముదాయించే ధోరణిలో పలకరించటం మొదలుపెట్టారు.

నీలకి అంతా అయోమయమైపోయింది-,

మీరా వెంటనే కల్పించుకుని ఏమిటట్రా మీ గోల దానికి కథలు రాయడం, నవలలు రాయడం వచ్చుగానీ, ఈ రంగు రాసుకోవడం రాదు. అయితే అది చెప్పడానికి

మనమందరం లేం? - అంటూ అదొక హాస్యంగా తేలిగ్గా నవ్వేసింది. నీల జుట్టుకు రంగు వేసుకునే వారిని చిన్నగా చూడదు గానీ ఆమెకది పెద్దగా అవసరం అనిపించని మాట నిజం.

ఆ రాత్రి మీరా నీలవేణిని పట్టుకుని కుడి చెవి వెనకాల, జుట్టు దగ్గర కొంచెం టెస్ట్ కోసం డై రాసి ఓ గంటసేపు ఉంచింది. నీకేమైనా మంట పుట్టినా, దురదగా అనిపించినా చెప్పు అంది.

కానీ నీలవేణి అలాంటి లక్షణాలేమీ ఉన్నట్టూ, లేనట్టూ అనిపించి సరిగ్గా చెప్పలేకపోయింది.

మీరా చొరవగా పనిలో పడి అత్యంత శ్రద్ధగా నీల జుట్టుకి రంగు వేసింది. వేసిన ఒక గంటపైన ఉంచి చక్కగా షాంపూ చేసింది. నీల జుట్టుతో బాటుగా రూపం కూడా మారిపోయింది. ఆమె అద్దంలో తన ముఖం చూసుకుని నమ్మలేకపోయింది. ఈ నల్లని జుట్టు తనలోని వయసును పదేళ్ళు తగ్గించినట్లనిపించింది. తనలోని అందాన్ని రెండింతలు పెంచినట్లుగా కూడా అనిపించింది. ఒకవైపు గర్వం ఆనందం కలుగుతూనే మరొకవైపు ఓడిపోయిన బాధ, తనది కానిదాన్ని మోస్తున్న భారం, ఇంత అసహజత్వం అవసరమా అనే బెంగా ఆమెని కొంత కృంగదీశాయి. జుట్టు మాత్రం తుమ్మెద రెక్కల్లా నిగనిగలాడింది.

అయితే తెల్లారేసరికి ఆమె తలంతా భారంగా, తలకట్టు అంచు చూపుడు వేలంతా లావుగా ఉబ్బిపోయింది. ముఖం కూడా వాచింది. అక్కడక్కడ దురదగా చిరచిరలాడుతోంది. తన ముఖం చూసుకుని తనే అదిరిపోయింది నీల. నిన్న కనిపించిన అందం ఈ పూట మాయమైంది-

మీరా చాలా కంగారుపడిపోయింది.

"అదేవిటే నిన్న టెస్ట్ చేశానుగా, ఏం లేదన్నావు" అంది.

"ఏమో..." నీల భారంగా మూలిగింది.

"మరేం భయం లేదులే. ఇప్పుడే డాక్టరుకి ఫోను చేస్తాను" అంది. ఆయన ఎవిల్ వేయమని చెప్పి" కొంతమందికి కెమికల్స్ పడవు. ఇక ముందు ఆమెని డై వాడద్దని చెప్పండి" అన్నాడు.

మీరా టాబ్లెట్స్ తెచ్చి నీలకి వేసి

"కాస్సేపు పడుకో - సాయంత్రం సభ ఉంది కూడా" అంది కాస్త డల్‌గా.

నీలకి నవ్వొచ్చింది. 'తను అధునిక స్త్రీల సమస్యల గురించి మాట్లాడడానికా, అందాల పోటీకా ఇక్కడికొచ్చింది" కళ్లు మూసుకుంది.

ఏది ఏమైనా, ఆరోగ్యం దెబ్బతిని, శరీరం ఏమాత్రం మొరాయించినా, మనసు మరో ఆలోచన వైపు మళ్లదు. ఆ అనారోగ్యం గురించి ఆలోచించుకోవడానికే ఎంత సమయం చాలదు.

సాయంత్రం సభలో నీల బాగా మాట్లాడింది. అందరూ చాలా మెచ్చుకున్నారు. నుదుటి మీద దురద, జుట్టు లోపల తల భారం ఆమెకే పరిమితమై, నల్లగా నిగనిగలాడే జుట్టు మాత్రం ప్రేక్షకుల్ని అలరించినట్టు నీల లోలోపల అనుకుని సరిపెట్టుకుంది.

రైలు కదిలింది. ఎన్నో చేతులు తనకి వీడ్కోలు చెప్తున్నాయి. ఎన్నో జతల కళ్ళు తనవైపు ప్రేమగా, ఆరాధనగా చూస్తున్నాయి. అందరూ నెమ్మదిగా దూర మయ్యారు.

లోపలికొచ్చి సీట్లో కూర్చుంది. ఏ.సి. కంపార్టుమెంటు చల్లగా ఉంది. అంతలోనే గుర్తుకొచ్చినట్లు మళ్ళీ అద్దంలో ముఖం చూసుకుంది. ఇప్పుడది అందంగా లేకపోగా ఏదో వికృతంగా అనిపించింది. తనదైన అసలు ముఖం ఎక్కడో పారేసుకున్న భావం కలిగింది.

తనకి బయట ప్రపంచం కనిపించే వీలుంది, తను మాత్రం బయట మనుషులకి కనిపించని అద్దాల్లోంచి కదులుతున్న ప్రకృతిని చూస్తూండిపోయింది.

ఈ నాలుగు రోజులూ అస్సలు గుర్తు రాని భర్త రాంప్రసాద్ గుర్తుకొచ్చాడు. అతను గుర్తుకొస్తూనే కాస్త కోపం కూడా తీసుకొచ్చాడు. తన మిత్రులంత గొడవ చేసి, రాద్ధాంతం చేసిన తన తెల్లజుట్టు గురించి రాంప్రసాద్ ఎప్పుడూ ఎందుకు ప్రస్తావించలేదో ఆమె కర్థం కాలేదు. అతనికి తన రూపం మీదా అస్తిత్వం మీదా శ్రద్ధ తగ్గిపోయిందేమో తనకు తానుగా పోషించుకొస్తున్న తన వ్యకిత్వం అతని కద్దు రానంతవరకు అభ్యంతరం ఉండదు.

ఆలోచిస్తున్న కొద్దీ నీలవేణి మనసు చిరాకు పడడం మొదలైంది. ఇదేమంత గొప్ప సమస్యనీ తనింతగా ఆలోచించి తల బద్దలు కొట్టుకుంటోంది?

మిత్రులందరూ వారి వారి పుస్తకాలు ఒక్కొక్క కాఫీ యిచ్చారు, చదివి తన అభిప్రాయం తెలపమని వారి ఆశ.

నీలవేణి వాటిలోంచి ఒక పుస్తకం తీసుకుని పేజీలు తిప్పడం మొదలుపెట్టింది.

ఎప్పుడు నిద్రపట్టిందోగానీ కళ్ళు తెరిచేసరికి తను గమ్యం చేరేందుకు రెండు గంటలు మాత్రమే ఉందని తెలిసింది -

రైలు ఆగుతుండగానే దూరంగా రాంప్రసాద్ కనిపించి నవ్వాడు. రైలు దిగంగానే నవ్వుతూ కళ్ళెగరేశాడు - ఆ నవ్వులో - ఆ కనుబొమ్మలెగరేయడంలో ఏదో కొంటెతనం - ఎగతాళి కనిపించాయి. అయినా తనూ నవ్వేసి ఊరుకుంది.

"ఏమిటీ - పదేళ్ళ వయస్సు తగ్గినట్టు కనిపిస్తున్నారే రచయిత్రిగారు" అన్నాడు.

వెంటనే ఘాటుగా ఏం సమాధానం చెప్పాలో తెలీలేదు. కొంచెం ఆగి, "మీ సావాసం వల్ల మరీ ముసలి దాన్నయి పోయానని గ్రహించీ.."

"నా సావాసమూ! నాన్సెన్స్ 'నేనెప్పుడు నవయువకుడిలా ఉండాలని చూస్తాను" బ్యాగ్ అందుకుని వేగంగా ముందుకు కదులుతూ అన్నాడు.

"మీ గురించి కాదు, నా గురించి" చటుక్కునంది.

"నువ్వు ఆడదానికి, అందులోనూ భార్యవి - మళ్ళీ మాట్లాడితే రచయిత్రిని. నీ గురించి నువ్వే ఆలోచించుకోవాలి".

ఊళ్ళో స్నేహితులందరూ తన జుట్టు చూసి ఎంతో మురిసిపోయారు. ఎలాగైనా ఆ నల్లదనం కాపాడుకోమని, లేకపోతే నీలవేణి పేరు శ్వేతవేణిగా మార్చాల్సి వస్తుందని జోక్స్ వేసి వేసి వేధించారు.

తామెప్పుడో అనుకున్నామని, కాకపోతే మీతో చెప్పలేకపోయామని నొచ్చుకున్నారు. నెల్లాళ్ళు గడిచేరికి జుట్టు రంగు నెమ్మదిగా వెలిసి తెల్ల జుట్టు బయట పడడం మొదలైంది.

పైకి కనిపించే మనిషికి లోపల దాగుండే మనిషికీ ఎంత తేడా ఉంటుందోనీలకి అర్థమవుతూ ఉంది.

తను సహజత్వాన్ని ఆహ్వానిస్తుంది. తను తనలాగే ఉంటుంది. ఇలాగే ఉండిపోతుంది. తన తెల్లని జుట్టు చూసి ప్రేమించి, అభిమానించే వారుండకపోరు.

●